సాక్షి
సిద్దిపేట

బుధవారం । 4 । జనవరి । 2023



లక్ష్యం 50 వేల ఎకరాలు

రైతులకు దీర్ఘకాలిక ఆదాయం అందించే ఆయిల్‌పామ్ సాగుపై ప్రభుత్వం దృష్టి సారించింది. రైతులను సాగువైపు మళ్లించేందుకు అవగాహన కల్పిస్తోంది. 8లో..



ఔటర్‌పై అత్యవసర వైద్య సేవలు

ఔటర్ రింగురోడ్డుపై ప్రమాదాల నియంత్రణకు హెచ్ఎండీఏ చర్యలు చేపట్టింది. ప్రతీ ఎనిమిది కి.మీలకు ఒక అంబులెన్స్ అందుబాటులో ఉండేలా ఏర్పాట్లు చేసింది. 8లో..



సబ్‌కోర్టుతో కక్షిదారులకు మేలు

హుస్నాబాద్‌కు సబ్‌కోర్టు మంజూరైన సందర్భంగా మంగళవారం ఎమ్మెల్యే సతీశ్ కుమార్‌ను కలిసి న్యాయవాదులు కృతజ్ఞతలు తెలిపారు. 9లో..

న్యూస్‌రీల్

'సావిత్రీబాయి సేవలు మరువలేనివి'



నివాళులర్పిస్తున్న న్యాయవాదులు

సిద్దిపేటకమాన్: సావిత్రీబాయి పూలే గొప్ప కవి, రచయిత్రి అని సిద్దిపేట బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి కొనయాడారు. ఆమె జయంతి సందర్భంగా సిద్దిపేట కోర్టులో మంగళవారం చిత్రపటానికి న్యాయవాదులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ.. సావిత్రీబాయి త్యాగం, సేవ, నిబద్ధత కలిగిన మహిళ అని కొనియాడారు. ఆధునిక భారతదేశ చరిత్రలో ధ్రువ తారగా వెలుగొందుతూనే ఉంటుందన్నారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు సాయిబాబ, బాబురావు, రవిబాబు, పత్రి ప్రకాష్, శ్రీశైలం, యాదగిరి, రేణుక, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

15, 16న జిల్లాస్థాయి కబడ్డీ టోర్నమెంట్

కొండపాక(గజ్వేల్): 15, 16వ తేదీల్లో మండల పరిధిలోని దుద్దెడ హైస్కూల్ ఆవరణలో జిల్లా స్థాయి కబడ్డీ క్లబ్ జట్ల టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నట్లు సర్పంచ్‌ల ఫోరం జిల్లా అధ్యక్షుడు ఆరెపల్లి మహాదేవ్‌గౌడ్, జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కుంటనోళ్ల శివకుమార్ వేర్వేరుగా తెలిపారు. మంగళవారం వారు హైస్కూల్ ఆవరణను వారు పరిశీలించారు. వారు మాట్లాడుతూ జిల్లాలో మొదటి సారిగా కబడ్డీ ఆటను మ్యాట్‌పై నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రో కబడ్డీ మాదిరిగా ఈ టోర్నమెంట్ కేవలం 10 జట్లతో లీగ్ కం నాకౌట్ పద్ధతిలో నిర్వహిస్తున్నామన్నారు. ఈ అవకాశాన్ని జిల్లా వ్యాప్తంగా ఉన్న కబడ్డీ క్రీడాకారులు ఉపయోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో దుద్దెడ కబడ్డీ క్లబ్ ప్రధాన కార్యదర్శి చిన్ననర్సు కరుణాకర్, జాయింట్ సెక్రటరీ కిషన్, పల్లె స్వామి, కోశాధికారి సంపత్, కార్యనిర్వాహక కార్యదర్శులు కొమ్ము లక్ష్మణ్, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు

సిద్దిపేటరూరల్: ప్రభుత్వ హాస్టళ్లలో విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తాటికొండ రవి డిమాండ్ చేశారు. మంగళవారం ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో విద్యార్థుల సమస్యల పరిష్కారానికి కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమం నిర్వహించారు. పెండింగ్ స్కాలర్‌షిప్స్ ఇవ్వాలని, మెస్, కాస్మోటిక్ చార్జీలు పెంచాలని స్థానికంగా లేని వార్డెన్లను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. అద్దె భవనంలో కొనసాగుతున్న గురుకుల హాస్టళ్లకు, సాంఘిక హాస్టళ్లకు సొంత భవనాన్ని వెంటనే నిర్మించాలన్నారు. జిల్లా కేంద్రంలో యూనివర్సిటీని ఏర్పాటు చేయాలని, ఖాళీగా ఉన్న టీచర్స్, వార్డెన్ పోస్టులని భర్తీ చేయాలన్నారు. కలెక్టరేట్ ముట్టడి స్వల్ప ఉద్రిక్తత చోటు చేసుకోవడంతో నాయకులను అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కార్యక్రమంలో అధ్యక్షులు, కార్యదర్శి రెడ్డమైన అరవింద్, దాసరి ప్రశాంత్, కొండం సంజు, రంజిత్‌రెడ్డి, నవీన్, నాయకులు మధు, సంతోష్, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలకు క్రీడాకారుల ఎంపిక



ఎంపికైన క్రీడాకారులు

గజ్వేల్‌రూరల్: రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలకు ఉమ్మడి మెదక్ జిల్లా జట్టుకు క్రీడాకారులను ఎంపిక చేసినట్లు అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు డానియెల్, ప్రధాన కార్యదర్శి రంజిత్‌కుమార్ తెలిపారు. మంగళవారం వారు విలేకరులతో మాట్లాడారు. పట్టణంలోని బాలుర ఎడ్యుకేషన్ హబ్‌లో క్రీడాకారులను ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ ఎంపికకు సుమారు 100 మంది హాజరుకాగా పురుషుల విభాగంలో 12మంది, మహిళల విభాగంలో 12మందిని ఉమ్మడి జిల్లా జట్టుకు ఎంపిక చేసినట్లు తెలిపారు. వీరు ఈనెల 7, 8 తేదీల్లో ఖమ్మం జిల్లాలో రాష్ట్రస్థాయి సీనియర్ పురుషులు, మహిళల నెట్‌బాల్ పోటీలలో పాల్గొనున్నట్లు తెలిపారు. ఈ పోటీల్లో ప్రతిభను చాటి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

త్రీస్టార్ రేటింగ్‌లో నంబర్‌వన్

జాతీయ స్థాయిలో 'సిద్దిపేట'కు గుర్తింపు

- స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్‌లో మెరిసిన పల్లెలు
- 709 జిల్లాల్లో మొదటి ర్యాంకు
- 196.1 మార్కులతో ఫోర్ స్టార్ రేటింగ్‌కు అర్హత



పుల్లూరు పంచాయతీ డంపింగ్ యార్డు

సాక్షి, సిద్దిపేట: స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ విభాగంలో జిల్లాకు చెందిన పంచాయతీలు జాతీయ స్థాయిలో మెరిశాయి. కేంద్ర ప్రభుత్వం గ్రామాల్లోని స్వచ్ఛత అంశాలను పరిగణనలోకి తీసుకొని జిల్లాల ర్యాంకులను స్టార్ రేటింగ్‌ల వారీగా విడుదల చేసింది. దేశంలోని 709 జిల్లాల్లో త్రీస్టార్ రేటింగ్‌లో సిద్దిపేట జిల్లా 196.10 మార్కులు సాధించి మొదటి ర్యాంక్‌లో నిలిచింది. జిల్లా వ్యాప్తంగా పలు గ్రామాల్లో తడి, పొడి చెత్తను వేరు చేసి ప్రజలు అందిస్తున్నారు. అలాగే తడి చెత్తతో ఎరువును తయారు చేసి విక్రయించి పలు పంచాయతీలు ఆదాయం పొందుతున్నాయి. ప్రజాప్రతినిధులు, అధికారుల కృషితో జాతీయ స్థాయిలో ఈ ర్యాంకులు సాధ్యమయ్యాయి.

ప్రతీ మూడు నెలలకోసారి..

- జిల్లాలో మొత్తం 499 పంచాయతీలున్నాయి. ప్రతీ గ్రామానికి డంపింగ్ యార్డును నిర్మించారు. అలాగే ఇంటింటికీ తిరిగి చెత్తను సేకరించేందుకు వాహనాలు సైతం అందుబాటులో ఉన్నాయి. స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్‌లో భాగంగా ఆయా గ్రామ పంచాయతీల లాగిన్ నుంచి స్వచ్ఛ సర్వేక్షణ్‌కు వివరాలను అందిస్తున్నారు.
- దీంతో ప్రతి మూడు నెలలకు ఒకసారి స్టార్ రేటింగ్‌లో మార్కులను స్వచ్ఛ భారత్ మిషన్ వెల్లడిస్తోంది.
- అక్టోబర్, నవంబర్, డిసెంబర్–2022 సంవత్సరానికి గాను సిద్దిపేట జిల్లా డెల్టా అచీవ్‌మెంట్‌లో 196.10 మార్కులను సాధించింది. మూడో స్టార్ రేటింగ్ నుంచి నాలుగో స్టార్ రేటింగ్‌లో అర్హత సాధించింది.
- ఇక జనవరి నుంచి జిల్లా, మండల, గ్రామ స్థాయిలో ర్యాంక్‌లను మూడు నెలల పాటు స్వచ్ఛ సర్వేక్షణ్‌లో పనితీరును పరిశీలించి ఏప్రిల్‌లో మళ్లీ ర్యాంక్‌లను ప్రకటించనుంది.
- ఇదే విధంగా గ్రామ స్థాయిలో తడి,పొడి చెత్త వేరు చేయడం, తడి చెత్త ద్వారా కంపోస్టు ఎరువు తయారు చేయడం, గ్రామ పరిసరాలు పరిశుభ్రంగా ఉండటం, ఖాళీ స్థలాల్లో నీటి నిల్వలు లేకుండా చేయడం ప్రతి ఇంటికి మరుగుదొడ్లు ఉండటం వినియోగించడం వలన అక్టోబర్‌లో ప్రకటించే స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ విభాగంలో జాతీయ స్థాయిలో పురస్కారం రానుంది.

చెత్తతో పంచాయతీకి ఆదాయం



మా గ్రామంలో వచ్చిన తడి చెత్తను ఎరువుగా మార్చడంతో రూ.1.10 లక్షల ఆదాయం వచ్చింది. ఎవరూ చెత్త బయట వేసినా రూ.500 జరిమానా విధిస్తున్నాం. నెల రోజుల పాటు నాతో పాటు వార్డు సభ్యులు, యువత ట్రాక్టర్‌తో తిరిగాం. తడి చెత్త సోమ, బుధ, గురు, శనివారాలు, పొడి చెత్తను మంగళవారం, శుక్రవారం అందించాలని ఇంటింటికీ తిరిగి వివరించాం. దీంతో మా గ్రామ మహిళలు అందరూ ట్రాక్టర్‌కు అందిస్తున్నారు. మా డంపింగ్ యార్డులో ఎరువును తయారు చేస్తున్నాం. ఇంకా ఎరువు అందుబాటులో ఉంది. పామాయిల్ తోటలకు ఎక్కువగా తీసుకెళ్తున్నారు.

–నరేశ్, సర్పంచ్, పుల్లూరు

పల్లె ప్రగతిలో గుణాత్మక మార్పులు



సీఎం కేసీఆర్ మార్గదర్శకాలతో ఆరంభించిన పల్లెప్రగతి కార్యక్రమంతో గ్రామల్లో గుణాత్మక మార్పులు వస్తున్నాయి. మన గ్రామాలు దేశ వ్యాప్తంగా ఆదర్శంగా నిలుస్తున్నాయి. జిల్లాను ప్రథమ స్థానంలో నిలిపిన అధికారులు, ప్రజా ప్రతినిధులకు అభినందనలు. ఇదే స్ఫూర్తితో మండల, గ్రామలకు గుర్తించే లభించేలా అందరూ కృషి చేయాలి.

–హరీశ్‌రావు మంత్రి, ఆర్థిక వైద్యారోగ్య శాఖ

'బీఆర్ఎస్ కోవర్టుల తప్పుడు ప్రచారం'



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

దుబ్బాకటౌన్: బీజేపీ సీనియర్ నాయకులమంటూ చెప్పుకుంటున్న కొందరు బీఆర్ఎస్ కోవర్టులు.. వారిచ్చే డబ్బులకు అమ్ముడుపోయి ఎమ్మెల్యే రఘునందన్‌రావుపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రోశయ్య, కార్యదర్శి భిక్షపతి ఆరోపించారు. మంగళవారం దుబ్బాక పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్లతో వారు మాట్లాడారు. గతంలో దుబ్బాక నియోజకవర్గంలో బీజేపీ టికెట్ తెచ్చుకొని సంక్రాంతికి గంగిరెద్దులు వచ్చినట్లుగా వచ్చి పార్టీ డబ్బులు తీసుకొని ప్రచారం చేయకుండా పోయి సికింద్రాబాద్‌లో లాడ్జింగ్‌లో ఉన్న నాయకుడుతో పాటు మరో ఇద్దరు ముగ్గురు కలిసి బీఆర్ఎస్ కోవర్టులుగా పని చేస్తూ ఎమ్మెల్యేపై కుట్రతోనే తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. మాజీ ఎమ్మెల్యే వాసురెడ్డి ఆరోగ్యం బాగలేదని పరామర్శించి వద్దామని బీజేపీ కార్యకర్తలను కొందరిని తీసుకెళ్లిన వాళ్ల బీఆర్ఎస్ కోవర్టులు దొంగనాటకాలు ఆడుతున్నారని విమర్శించారు. సీనియర్ నాయకులైతే ఎందుకు పదవులు లేవని ప్రశ్నించారు. కోవర్టు రాజకీయాల సంగతి అధిష్టానం చూసుకుంటందని హెచ్చరించారు. నియోజకవర్గంలో ఎమ్మెల్యే రఘునందన్‌రావు నాయకత్వంలో బీజేపీ బలంగా ఉందని కార్యకర్తలు అందరూ సంతోషంగా ఉన్నారన్నారు. సమావేశంలో బీజేపీ సీనియర్ నాయకులు గవ్వల రమేశ్, గాజుల భాస్కర్, వెంకట్‌గౌడ్, అరిగె కృష్ణ, సుంకోజి ప్రవీణ్, రమేశ్‌రెడ్డి ఉన్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు నలుగురు క్రీడాకారుల ఎంపిక



ఎంపికైన క్రీడాకారులు

సిద్దిపేట ఎడ్యుకేషన్: జిల్లా యువజన, క్రీడా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మహబూబ్‌నగర్ లో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు జిల్లా యువజన సంక్షేమ, క్రీడా శాఖ అధికారి నాగేందర్ ఆధ్వర్యంలో క్రీడాకారుల ఎంపిక నిర్వహించారు. మంగళవారం సిద్దిపేట జిల్లా కేంద్రంలోని కబడ్డీ స్టేడియంలో జిల్లా స్థాయిలో అభ్యర్థులను ఎంపిక చేశారు. ఎం.సంధ్య, కె. దివ్య, ఆర్. చేతస్ , కొంపల్లి బాలకృష్ణ నలుగురు క్రీడాకారులను ఎంపిక చేశారు. కార్యక్రమంలో న్యాయ నిర్ణేతలుగా కబడ్డీ అసోసియేషన్ సెక్రెటరీ శివకుమార్ , ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ కబడ్డీ విన్నర్ దారావత్ రమేష్, శ్రీకాంత్, యువజన సంఘ సమితి జిల్లా ఉపాధ్యక్షుడు అధికం రాజు గౌడ్, చేపూరి విజయ్ కుమార్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

మహిళా చైతన్యానికి సావిత్రీబాయి కృషి

అరుణోదయ సాంస్కృతిక సారథి విమలక్క



బహుమతులు అందజేస్తున్న విమలక్క

బెజ్జంకి(సిద్దిపేట): మహిళల ఎదుగుదలకు, విద్యావకాశాల కోసం కృషి చేసిన మహనీయురాలు సావిత్రీబాయి పూలే అని అరుణోదయ సాంస్కృతిక సారథి, ప్రజా గాయకురాలు విమలక్క అన్నారు. ఆమె జయంతోత్సవ కమిటీ చైర్మన్ పెద్దాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో మంగళవారం సావిత్రీబాయి జయంతి వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న విమలక్క మాట్లాడుతూ 1848లోనే తన మిత్రురాలి సహకారంతో పాఠశాలలను నిర్వహించి మహిళలకు విద్యావకాశాలు కల్పించిన తొలి ఉపాధ్యాయురాలు సావిత్రీబాయి అని తెలిపారు. పూలే జయంతిని ఉపాధ్యాయ దినోత్సంగా నిర్వహించాలని కోరారు. స్వాతంత్రం వచ్చి ఇన్నేళ్లయినా వివక్ష కొనసాగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. విగ్రహాల ఏర్పాటులోను కుల ఘర్షణలు జరుగుతున్నాయంటే సమాజం ఎటువైపు పయానిస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. బద్దం ఎల్లారెడ్డిలాంటి పోరాటల వీరుల స్ఫూర్తితో అప్రమత్తతో, ఐక్యంగా ముందుకు సాగితేనే మనుగడ ఉంటుందన్నారు. అనంతరం వ్యాసరచన పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. బెజ్జంకిలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళుర్పించారు. కార్యక్రమంలో ఓరుగంటి ఆనంద్, ఎంపీపీ లింగాల నిర్మల, ఏఎంసీ చైర్మన్ కచ్చు రాజయ్య, ఎంపీడీఓ దమ్మని రాము, ప్రిన్సిపాల్ హిమబిందు, సర్పంచ్ మంజుల, పలు పార్టీల నాయకులు అశోక్, రూపేష్, శ్రీనివాస్‌గౌడ్, శ్రీనివాస్, రవి, రాజేశం గౌడ్, ప్రభాకర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

'వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి'



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంత్‌జీవన్ పాటిల్

దుబ్బాకరూరల్: మండలంలోని హబ్సీపూర్‌లో మహాత్మాజ్యోతీబాపులే బాలుర గురుకుల పాఠశాలను కలెక్టర్ ప్రశాంత్‌జీవన్ పాటిల్ సందర్శించారు. గురుకుల పాఠశాల ఇంటర్మీడియట్‌కి అప్‌గ్రేడ్ అయినందున ప్రస్తుతం గదుల కొరత ఉన్న విషయాన్ని జిల్లా బీసీ సంక్షేమ అధికారి సరోజ, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. అదే విధంగా ఇటీవల జిల్లా కేంద్రంలో జరిగిన జెడ్పీ సమావేశంలో జెడ్పీటీసీ రవీందర్‌రెడ్డి గురుకుల పాఠశాలలో మౌలిక వసతులు కల్పించాలని కోరారు. మంగళవారం కలెక్టర్ గురుకుల పాఠశాలను సందర్శించి విద్యార్థులతో ముచ్చటించారు. పదోరగతి విద్యార్థులు పరీక్షలకు ఇప్పటి నుంచే సన్నద్ధం కావాలని సూచించారు. విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. మెను ప్రకారం విద్యార్థులకు స్నాక్స్, భోజనం అందించాలన్నారు. పాఠశాలలో తాత్కలికంగా ఆరు తరగతి గదులు, డైనింగ్ హాల్, టాయిలెట్లు నిర్మాణానికి సీబీఎఫ్ ద్వారా నిధులు కేటాయిస్తానన్నారు. వాటి నిర్మాణానికి సంబంధించి ఎస్టిమెట్ వేసి త్వరగా ప్రతిపాదనలు పంపించాలని ఏఈ రిజ్వాన్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్‌సీఓ ప్రభాకర్, ఎంఈఓ ప్రభుదాస్, ఎంపిడిఓ భాస్కరశర్మ, పాఠశాల ప్రిన్సిపాల్ రాణి, సర్పంచ్ శ్రీనివాస్ పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో అధికారులు, ప్రజాప్రతినిధులు

'కంటి వెలుగు'ను వందశాతం నిర్వహిస్తాం

- కలెక్టర్ ప్రశాంత్‌జీవన్ పాటిల్
- వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రులు హరీశ్‌రావు, ఎర్రబెల్లి

సిద్దిపేటరూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతీష్టాత్మకంగా చేపట్టిన కంటివెలుగు కార్యక్రమాన్ని వంద శాతం నిర్వహిస్తామని కలెక్టర్ ప్రశాంత్‌జీవన్ పాటిల్ వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు, మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావులకు వివరించారు. మంగళవారం 18వ తేదీ నుంచి నిర్వహించనున్న రెండో విడుత కంటి వెలుగు కార్యక్రమంపై హైదరాబాద్ నుంచి మంత్రులు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి హరీశ్‌రావు కలెక్టర్లకు పలు సూచనలు సలహాలు అందించారు. ప్రభుత్వం సూచించిన నిబంధనల మేరకు జిల్లా యంత్రాంగాలు పూర్తిస్థాయిలో కంటివెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. అనంతరం కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ మాట్లాడుతూ జిల్లాలో 45 బృందాలలు ఏర్పాటు చేశామన్నారు. రోజు ప్రాంతాల వారీగా షెడ్యూల్ తయారు చేశామన్నారు. మంత్రులు, ప్రభుత్వం సూచించిన విధంగా 100 రోజుల కార్యక్రమాన్ని ఖచ్చితంగా శతశాతం విజయవంతం చేస్తామన్నారు. ఈ నెల 12లోపు ఎంపీపీ, మున్సిపల్, మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయిలో మీటింగ్ లు నిర్వహించడం జరుగుతుందన్నారు. జిల్లాలో కొత్తగా 38 మంది అప్రెంటిస్ డాక్టర్లను ఈ ప్రోగ్రాంలో ఉపయోగిస్తున్నామన్నారు. కంటి వెలుగు కార్యక్రమాన్ని నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జెడ్పీ చైర్‌పర్సన్ రోజారాధాకృష్ణ శర్మ, ఎమ్మెల్సీ యాదవరెడ్డి, అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, డీఎం హెచ్ఓ డాక్టర్ కాశీనాథ్, డీఆర్డీఓ గోపాల్‌రావు, జెడ్పీ సీఈఓ రమేశ్, డీపీఓ దేవకీదేవి, మున్సిపల్ చైర్మన్లు, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

ఇంటిగ్రేటెడ్ మార్కెట్ స్వచ్ఛత భేష్



ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌లో నాణ్యత, శుభ్రతను పరిశీలిస్తున్న అధికారులు

సిద్దిపేటజోన్: ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఎస్ఏఐ) బృంద సభ్యులు మంగళవారం సిద్దిపేట ఇంటిగ్రేటెడ్ మార్కెట్ లోని వెజ్ – నాన్ వెజ్ బ్లాక్‌లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడారు. పరిసరాల, వ్యక్తిగత పరిశుభ్రత బాగుందని కితాబిచ్చారు. ప్రజల ఆరోగ్య రక్షణ చర్యల్లో భాగంగా ఇంటిగ్రేటెడ్ మార్కెట్ లో పరిశుభ్రత వసతులు గూర్చి ఆరా తీశారు. ఇంటిగ్రేటెడ్ అద్భుతంగా ఉందని, ఫుడ్ సేఫ్టీ నిబంధనల మేరకు వెజ్, నాన్ వెజ్ మార్కెట్‌లో అమలు చేయడం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రజలకు నాణ్యమైన కూరగాయలు, నాన్ వెజ్ అందించడానికి తీసుకుంటున్న చర్యలను గూర్చి అడిగి తెలుసుకున్నారు. వారికి మార్కెట్ కమిటీ చైర్మన్ విజిత వేణుగోపాల్ రెడ్డి వివరించారు. ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌ను పరిశీలించిన అథారిటీ సభ్యులు వికాష్ మిశ్రా, విజయ్ కుమార్, జ్యోతిర్మయి, కలీల్, ధర్మేంద్ర, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.

'రామకోటి'కి కళారత్న పురస్కారం



అవార్డును అందుకుంటున్న రామరాజు

గజ్వేల్‌రూరల్: కలలకు కాదేది అనర్హమన్నట్లు బియ్యపు గింజలు మొదలుకొని సబ్బు బిళ్లల వరకు సంస్కృతి, సంప్రదాయాలను తెలియజేస్తూ... ప్రముఖుల చిత్రాలను గీసి అందరిచే మన్ననలు పొందిన గజ్వేల్ పట్టణానికి చెందిన రామకోటి భక్త సమాజం వ్యవస్థాపక అధ్యక్షుడు రామకోటి రామరాజు కళారత్న పురస్కారాన్ని అందుకున్నారు. మహాజన సాహిత్య అకాడమీ రాష్ట్ర కన్వీనర్ కామల్ల ఐలన్న ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మంగళవారం సావిత్రీబాయి పూలే జయంతిని పురస్కరించుకొని వివిధ రంగాల్లో సేవలందించిన వారికి రాష్ట్రస్థాయి అవార్డులను అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ప్రముఖ వాగ్గేయకారులు, ఎమ్మెల్సీ గోరెటి వెంకన్న, తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరి గౌరీశంకర్, కవి, జర్నలిస్టు సతీష్ చందర్, ప్రొఫెసర్ నూరెళ్లు సుజాతల చేతుల మీదుగా రామకోటి రామరాజు కళారత్న అవార్డును అందుకున్నారు. రామరాజు మాట్లాడుతూ రాష్ట్రస్థాయి కళారత్న అవార్డు రావడం ఎంతో గర్వంగా ఉందన్నారు.

మొత్తం 4,360 మంది క్వాలిఫై

- ముగిసిన దేహదారుఢ్య పరీక్షలు
- 9,983 అభ్యర్థులకు 8,742 మంది హాజరు
- 49.87 శాతం మెయిన్స్‌కు అర్హత
- సిద్దిపేట పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత



అభ్యర్థులకు సూచనలు చేస్తున్న పోలీస్ కమిషనర్ శ్వేత

సిద్దిపేటకమాన్: పోలీస్ ఉద్యోగాల ఎంపికలో భాగంగా సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ ఆవరణలోని పరేడ్ గ్రౌండ్‌లో అభ్యర్థులకు పది రోజులుగా నిర్వహిస్తున్న ఫిజికల్ టెస్టులు (శారీరక దేహదారుఢ్య పరీక్షలు) మంగళవారంతో ముగిశాయి. మొత్తం 9,983 మంది అభ్యర్థులకు గాను 8,742 మంది హాజరుకాగా ఇందులో 4,360 మంది మెయిన్స్‌కు అర్హత సాధించారు. 49.87 శాతం మంది అభ్యర్థులు ఈవెంట్స్ క్వాలిఫై అయ్యారు. 1,241 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు. 6,970 మంది పురుషులు హాజరుకాగా 3,185 మంది (45.69 శాతం), 1,772 మంది మహిళా అభ్యర్థులు హాజరుకాగా 1,175 మంది (66.5శాతం) మంది క్వాలిఫై అయ్యారు. జిల్లా పోలీస్ అధికారులు, సిబ్బంది పీఈటీ టీచర్లు సాంకేతిక నిపుణుల సహకారంతో ప్రశాంతంగా పరీక్షలు పూర్తి చేసినట్లు తెలిపారు. చివరి రోజు మంగళవారం నిర్వహించిన ఈవెంట్స్‌లో 294 మంది క్వాలిఫై అయ్యారు.

పురుషుల కంటే మహిళలే అధికం

సీపీ శ్వేత మాట్లాడుతూ.. పోలీస్ కానిస్టేబుల్, ఎస్ఐ ఉద్యోగాల ఎంపికలో భాగంగా నిర్వహించిన దేహదారుఢ్య పరీక్షలను పూర్తి సాంకేతిక పరిజ్ఞానంతో, ఎలాంటి లోటుపాట్లు లేకుండా నిర్వహించామన్నారు. సీసీ కెమెరాలు, రేడియో ఫ్రీక్వెన్సీ సెన్సార్లు, రిస్ట్ బ్యాండ్ చిప్‌లను వినియోగించి పరీక్షలు నిర్వహించామన్నారు. ఉదయం 3 గంటల నుంచి ప్రక్రియ పూర్తి అయ్యేంతవరకు మైదానంలో విధులు నిర్వర్తించిన ప్రతి ఒక్కరిని ఆమె అభినందించారు. పోలీసు శాఖలో ఉద్యోగం సాధించే అభ్యర్థులకు రెండు విభాగాల్లో ప్రావీణ్యం కలిగి ఉండాలన్నారు. చదువుతో పాటు శారీరక ధృఢత్వం అవసరమన్నారు. రాష్ట్ర పోలీసు నియామక మండలి సూచించిన ఆదేశాల మేరకు ఎంపికైన అభ్యర్థుల డేటా ఆన్‌లైన్‌లో నమోదు చేశామన్నారు. ఎంపిక ప్రక్రియలో పురుషుల కంటే మహిళలే ఎక్కువ శాతం ఉత్తీర్ణత సాధించి, తుది రాత పరీక్షకు అర్హత సాధించారన్నారు. నియామక ప్రక్రియ సాఫీగా నిర్వహించడానికి ఎంతగానో కృషి చేసిన అడిషనల్ డీసీపీ మహేందర్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు శ్రీధర్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, సిద్దిపేట టూటౌన్ సీఐ రవికుమార్, సిద్దిపేట రూరల్ సీఐ జానకిరామ్‌రెడ్డిలను ప్రత్యేకంగా అభినందించారు. సాంకేతిక నిపుణుల బృందం, పీఈటీల బృందాన్ని సీపీ అభినందించారు. ఈవెంట్స్‌లో విధులు నిర్వహించిన అధికారులు, సిబ్బందికి ప్రశంస పత్రాలు అందజేశారు. గుడ్ సర్వీస్ రివార్డులను త్వరలోనే అధికారికంగా ప్రకటిస్తామని హామీ ఇచ్చారు. ఈవెంట్స్‌లో పాల్గొన్న హోంగార్డులకు నగదు రివార్డు అందజేశారు. ఒక నిమిషం కూడా సమయాన్ని వృథా చేయకుండా ప్రణాళికాబద్ధంగా కష్టపడి చదివి ఫైనల్ రాత పరీక్షకు సిద్ధంగా ఉండాలని అభ్యర్థులకు సూచించారు.



అదనపు డీసీపీ అడ్మిన్ మహేందర్‌కు ప్రశంసపత్రం అందజేస్తున్న సీపీ శ్వేత

క్లుప్తంగా

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న డీఎస్పీ రఘు

రాయికోడ్(అందోల్): సైబర్ నేరాల బారిన పడకుండా ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జహీరాబాద్ డీఎస్పీ రఘు అన్నారు. మంగళవారం రాయికోడ్ పోలీస్ స్టేషన్‌ను సీఐ వెంకటేష్‌తో కలిసి సందర్శించారు. నమోదైన కేసుల వివరాలు, కేసుల దర్యాప్తు, పురోగతి తదితర వివరాలను ఎస్‌ఐ ఏడుకొండలును అడిగి తెలుసుకున్నారు. రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అపరిచిత ఫోన్ కాల్స్‌కు స్పందించవద్దన్నారు. సైబర్ నేరాల నియంత్రణకు పోలీస్ శాఖ కృషి చేస్తోందన్నారు. వాహనదారులు ట్రాఫిక్ రూల్స్‌ను విధిగా పాటించాలన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలన్నారు.

ప్రమాదవశాత్తు ఇల్లు దగ్ధం



దగ్ధమైన ఇల్లు ఇదే..

మద్దూరు(హుస్నాబాద్): మండలంలోని వల్లంపట్ల గ్రామంలో ప్రమాదవశాత్తు ఇల్లు దగ్ధమైంది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన యాదగిరి కుటుంబంతో కలిసి హైదరాబాద్‌లో కూలీ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. సోమవారం అర్ధరాత్రి విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లుతో పాటు ఇంట్లో ఉన్న వస్తువులు పూర్తిగా దగ్ధమయ్యాయి. సుమారు రూ.5లక్షల వరకు ఆస్తి నష్టం జరిగిందని బాధితుడు వాపోయాడు.

చుంచనకోట దుర్గమ్మ గుడిలో చోరీ



చేర్యాల(సిద్దిపేట): మండల పరిధిలోని చుంచనకోట దుర్గమ్మ గుడిలో సోమవారం రాత్రి గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. మంగళవారం ఉదయం ఆలయాన్ని శుభ్రం చేసేందుకు వచ్చిన పొన్నబోయిన సిద్దులు గుడి తాళం పగులగొట్టి ఉండడాన్ని చూసి పోలీసులకు సమాచారం అందించాడు. ఈ చోరీలో 13 గ్రాముల బంగారు ఆభరణాలు, 36 తులాల వెండి ఆభరణాలు, రూ.5వేల నగదు చోరీకి గురైనట్లు ఫిర్యాదులో పేర్కొన్నారని ఎస్‌ఐ భాస్కర్‌రెడ్డి తెలిపారు.

జీవితంపై విరక్తితో వ్యక్తి ఆత్మహత్య



శ్రీకాంత్(ఫైల్)

టేక్మాల్(మెదక్): జీవితంపై విరక్తి చెందిన ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన టేక్మాల్ మండలం అచ్చన్నపల్లిలో చోటు చేసుకుంది. గ్రామస్తులు, పోలీసుల వివరాల ప్రకారం గ్రామానికి చెందిన గుండ్ల శ్రీకాంత్(27) ఆర్మూర్‌లో కూలి పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఏడాది కుటుంబంలో గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో భార్య మహేశ్వరి తల్లిగారింటికి వెళ్లింది. అప్పటి నుంచి ఒక్కడే ఉంటున్న శ్రీకాంత్ జీవితంపై విరక్తి చెంది సోమవారం రాత్రి ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మంగళవారం ఉదయం గమనించిన ఇరుగుపొరుగు పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జోగిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ లింగం తెలిపారు.

లక్ష్యం 50 వేల ఎకరాలు

- 'ఆయిల్‌పామ్'పై ప్రత్యేక దృష్టి
- రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు
- సాగు ప్రోత్సహించేందుకు రాయితీలు

సాక్షి, సిద్దిపేట: రైతులకు దీర్ఘకాలిక ఆదాయం అందించే ఆయిల్‌పామ్ సాగుపై ప్రభుత్వం దృష్టి సారించింది. రైతులను సాగువైపు మళ్లించేందుకు అవగాహన కల్పిస్తోంది. దీనిలో భాగంగా జిల్లాలో ఆయిల్‌పామ్ సాగును పెంచేలా రైతులను ప్రోత్సహించి, ఐదేళ్లలో 50 వేల ఎకరాల్లో సాగు లక్ష్యంగా జిల్లా యంత్రాంగం కార్యాచరణ సిద్ధం చేసింది. 35 ఏళ్ల పాటు ఆయిల్‌పామ్‌తో లాభాలు ఆర్జించవచ్చని రైతులకు అవగాహన కల్పిస్తున్నారు.

పుష్కలంగా నీరు

- సిద్దిపేట జిల్లాలో 6,766 ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగవుతోంది. ఇప్పటికే నంగనూరు మండలం నర్మెటలో 60 ఎకరాల్లో ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ నిర్మాణానికి మంత్రి హరీశ్‌రావు శంకుస్థాపన చేశారు.
- ఆయిల్‌పామ్ సాగుకు నీరు, తేమ ఎక్కువగా ఉండాలి. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా రంగనాయక సాగర్, కొండపోచమ్మ, మల్లన్నసాగర్, అనంతగిరి రిజర్వాయర్లు నిండుగా ఉండడంతో సాగుకు నీటి సమస్య తప్పింది.
- రైతులను సాగువైపు మళ్లించేందుకు గతేడాది నుంచి అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. అశ్వరావుపేటకు తీసుకెళ్లి ఆయిల్‌పామ్ సాగు విధానాన్ని చూపించారు.



మర్కూక్‌లో సాగవుతున్న ఆయిల్‌పామ్

- అంతేకాకుండా సాగు చేసే రైతులకు ప్రభుత్వం డ్రిప్, రాయితీ అందిస్తుండడంతో రైతులు సైతం ఆసక్తి చూపుతున్నారు.
- మొదటి ఏడాది ఎకరాకు సుమారు 5 టన్నులకు పైగా దిగుబడి వచ్చే అవకాశం ఉంది. ప్రస్తుతం రూ.15 వేలకు పైగా ధర పలుకుతోంది.
- తొలి ఏడాది ఎకరాకు సుమారు రూ. 75 వేల నుంచి రూ. లక్ష వరకు ఆదాయం వస్తుందని అధికారులు చెబుతున్నారు.
- నాలుగు నుంచి పదేళ్ల వరకు ఏటా రెండు టన్నుల చొప్పున దిగుబడి పెరుగుతూ వస్తోంది.
- పదేళ్ల నుంచి 35 ఏళ్ల వరకు సుమారు 12 నుంచి 15 టన్నుల వరకు దిగుబడి వస్తుంది.
- బాగా పెరిగిన ఆయిల్‌పామ్ తోటలో ఎకరానికి సుమారు ఏడాదికి 15 టన్నుల పంట తీయొచ్చు.
- కనీసం రూ. 15 వేల చొప్పున విక్రయించినా రూ. 2,25,000 వస్తుంది. రూ. 45 వేల వరకు ఖర్చులు పోయినా రూ.1.80 లక్షలు గిట్టుబాటు అవుతుంది.
- మరోవైపు అంతర పంటల ద్వారా అదనపు ఆదాయం ఆర్జించే అవకాశం ఉంది. అంతా కలిపి ఎకరాకు రూ.3 లక్షల వరకు సంపాదించవచ్చని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు.

మంత్రి చొరవతో..

- జిల్లాలో ఆయిల్‌పామ్ సాగు విస్తరణకు మంత్రి హరీశ్‌రావు ప్రత్యేక చొరవ తీసుకోవడంతో రైతులు సాగు చేసేందుకు ముందుకు వస్తున్నారు.
- వారంలో రెండు రోజులు జిల్లాలోని వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులతో మంత్రి సాగుపై సమీక్ష, టెలీకాన్ఫరెన్స్ నిర్వహిస్తున్నారు.
- ప్రతీ సమావేశంలో ఆయిల్‌పామ్ సాగు చేసేలా రైతులకు అవగాహన కల్పించాలని వ్యవసాయ, ఉద్యానవనశాఖ అధికారులకు సూచిస్తున్నారు.
- దీంతో జిల్లాలో క్రమంగా ఆయిల్‌పామ్ సాగు విస్తీర్ణం పెరుగుతోంది. నెల రోజుల్లో 1,050 ఎకరాల్లో సాగు చేశారు.
- 2021–22 వరకు 655 మంది రైతులు 2,770 ఎకరాల్లో సాగు చేశారు. 2022 ఏప్రిల్ నుంచి ఇప్పటివరకు 1,051 మంది రైతులు 3,996 ఎకరాల్లో సాగుచేస్తున్నారు.

సాగు పెంచేందుకు కృషి



ఐదేళ్లలో 50 వేల ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు లక్ష్యంగా ముందుకు సాగుతున్నాం. మంత్రి హరీశ్‌రావు ప్రత్యేక చొరవ, వ్యవసాయ, ఉద్యానవన సిబ్బంది సహకారంతో సాగు విస్తీర్ణం పెంచేందుకు కృషి చేస్తున్నాం. ఈ పంట సాగుతో రైతులు దీర్ఘకాలిక లాభాలు పొందవచ్చు.

– శివప్రసాద్, డిప్యూటీ డైరెక్టర్, వ్యవసాయ శాఖ

జాబ్ ఆఫర్ అంటూ మెసేజ్

లింక్ క్లిక్ చేసి పలుధఫాలుగా రూ.3,49,073 ట్రాన్స్‌ఫర్

పటాన్‌చెరు టౌన్: జాబ్ ఆఫర్ పేరుతో ఒకరికి వాట్సాప్ మెసేజ్ వచ్చింది. తన వివరాలు నమోదు చేసి..నగదు పంపాడు. ఇలా 3,49,073 రూపాయలు సైబర్ నేరగాడికి పంపి మోసపోయాడు. పోలీసుల కథనం ప్రకారం ...పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్‌కు చెందిన నరేష్ ప్రైవేట్ ఉద్యోగి. గత ఏడాది నవంబర్ 21వ తేదీన నరేష్‌కు జాబ్ ఆఫర్ పేరిట వాట్సాప్‌లో ఓ మెసేజ్ వచ్చింది. లింక్ క్లిక్ చేసి వివరాలు నమోదు చేశాడు. ముందుగా రూ.1000 చెల్లించాడు. ఈ మొత్తానికి కమీషన్ ఇచ్చారు. పెద్ద మొత్తంలో మనీ ట్రాన్స్‌ఫర్ చేస్తే రెట్టింపు డబ్బుతోపాటు కమీషన్ ఇస్తామని సైబర్ నేరగాడు నమ్మబలికారు. దీంతో బాధితుడు ఫలుదఫాలుగా రూ.3,49,073 ట్రాన్స్‌ఫర్ చేయగా, రూ.6,44,398 వస్తుందని నమ్మించారు. అయితే డబ్బు తన ఖాతాలో జమ చేయాలంటూ ఫోన్ చేయగా, నరేష్ నంబరు బ్లాక్‌లో పెట్టారు. దీంతో తన మోసపోయినట్టు గుర్తించి మొదటగా సైబర్‌క్రైంలో ఫిర్యాదు చేశాడు. మంగళవారం పటాన్‌చెరు ఠాణాలో కూడా ఫిర్యాదు చేశాడు.

డ్రంకెన్‌డ్రైవ్‌లో 23 మందికి జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన వాహనదారులకు సంగారెడ్డి కోర్టు జరిమానా విధించింది. పటాన్‌చెరు ట్రాఫిక్ సీఐ ప్రవీణ్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం ఆది, సోమవారాల్లో నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో 23 మంది పట్టుబడ్డారు. మంగళవారం కోర్టులో హాజరు పర్చగా జరిమానా విధించారు.

పాదచారుడిని ఢీ కొట్టిన వాహనం

- తీవ్రగాయాలు కావడంతో ప్రభుత్వ ఆస్పత్రికి తరలింపు
- మార్గమధ్యలో మృతి చెందినట్టు వైద్యుల వెల్లడి

పటాన్‌చెరు టౌన్: రోడ్డు దాటుతున్న పాదచారుడిని బొలెరో ట్రాలీ వాహనం ఢీకొట్టిన ఘటనలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా పరిశీలించిన వైద్యులు మార్గ మధ్యలోనే మృతిచెందినట్టు వెల్లడించారు. ఈ సంఘటన పటాన్‌చెరు పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ ప్రసాద్‌రావు కథనం ప్రకారం...వనపర్తి జిల్లా ఖిలాఘనపూర్ మండలం ఉప్పరిపల్లి గ్రామానికి చెందిన దత్తయ్య(44) బతుకుదెరువు కోసం వచ్చి పటాన్‌చెరులోని భగత్‌గల్లిలో నివాసం ఉంటున్నాడు. పటాన్‌చెరు పారిశ్రామికవాడలోని ఓ ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం 6.30 గంటలకు డ్యూటీకి వెళ్తుండగా నవపాన్ సమీపంలో రోడ్డు దాటుతుండగా బొలెరో ట్రాలీ ఢీకొట్టింది. దీంతో తీవ్రంగా గాయపడ్డాడు. దత్తయ్యను చికిత్స కోసం పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, పరిశీలించిన వైద్యులు మార్గమధ్యలోనే మృతిచెందినట్లు తెలిపారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



దత్తయ్య (ఫైల్)

ఉరి వేసుకొని వ్యక్తి ఆత్మహత్య

కంది(సంగారెడ్డి): ఉరి వేసుకొని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటనమండల పరిధిలోని కాశిపూర్‌లో చోటుచేసుకుంది. ఇంద్రకరణ్ ఎస్‌ఐ రాజేశ్‌నాయక్ కథనం ప్రకారం కాశిపూర్‌కు చెందిన షాపురం శోభన్ గౌడ్(39) రెండేళ్ల నుంచి కడుపునొప్పితో బాధపడుతున్నాడు. కడుపు నొప్పి బాధ భరించలేక మద్యానికి అలవాటుపడ్డాడు. దీంతో శోభన్ గౌడ్ మానసిక స్థితి సరిగా లేదు. ఈక్రమంలో సోమవారం రాత్రి ఇంట్లో ఎవరూ లేనిసమయంలో పైకప్పు రేకులకు అమర్చిన వైపునకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య షాపురం జ్యోతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



శోభన్ గౌడ్(ఫైల్)

విద్యుదాఘాతంతో గేదెలు మృతి

కోహెడరూరల్(హుస్నాబాద్): వేర్వేరు చోట్ల విద్యుదాఘాతంతో రెండు పాడి గేదెలు మృత్యువాత పడ్డాయి. కోహెడమండలంలోని తంగళ్లపల్లి మోయతుమ్మెద వాగులో ప్రమాదవశాత్తు విద్యుత్‌షాక్‌తో పాడిగేదె మృతి చెందింది. బాధితుడి కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన తొంటి రమేశ్ రోజూలాగే తన గేదెను వాగు సమీపంలో మేపుతున్నాడు. సోమవారం ఉదయం మెయతుమ్మెదవాగు దిగి నీరు తాగుతుండగా విద్యుత్ షాక్‌తో గేదె అక్కడిక్కడే మృతి చెందింది. దీంతో సుమారు 80వేల నష్టం వాటిల్లిందని రైతు రమేశ్ తీవ్రంగా రోదించాడు. బాధిత రైతుకు ప్రభుత్వం నుంచి పరిహారం అందేలా చూస్తానని సర్పంచ్ పాము నాగేశ్వరి శ్రీకాంత్ హామీ ఇచ్చారు.

తోర్నాలలో...

సిద్దిపేటరూరల్: కరెంటు షాక్‌కు గురై పాడి గేదె మృతి చెందిన సంఘటన సిద్దిపేట రూరల్ మండల పరిధిలోని తోర్నాల గ్రామంలో చోటు చేసుకుంది. రైతు సందిరెడ్డి కిష్టారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం .. తన వ్యవసాయ పొలం వద్ద రోజూలాగే మంగళవారం కూడా గేదెకు నీళ్లు పెడదామని పొలం దగ్గరకు తీసుకెళ్లాడు. పొలంలో నీళ్లు తాగుతుండగా పక్కనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ అర్తింగ్ వైరు తగిలి అక్కడికక్కడే చనిపోయింది. ఇటీవల గేదెను రూ.80వేలతో కొనుగోలు చేశానని, ఇప్పుడు మృతి చెందడంతో దిక్కుతోచని పరిస్థితి నెలకొందన్నారు. ప్రభుత్వం ఆదుకోవాలన్నారు.



గేదె వద్ద రోదిస్తున్న బాధిత రైతు

అదృశ్యమైన వ్యక్తి.. శవమై తేలి

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): అదృశ్యమైన ఓ యువకుడు చెరువులో శవమై తేలిన సంఘటన మంగళవారం మండల పరిధిలోని వెంకటాపూర్ గ్రామంలో చోటుచేసుకుంది. సదాశివపేట సీఐ నవీన్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం..వెంకటాపూర్ గ్రామానికి చెందిన మన్నే లక్ష్మణ్(24)ఓ పరిశ్రమలో కాంట్రాక్టు కార్మికుడిగా పని చేస్తున్నాడు. గత నెల 31న తన తండ్రి కిష్టయ్యతో కలిసి భోజనం చేసి రాత్రి 9గంటల సమయంలో ఇద్దరు కలిసి పడుకున్నారు. అదేరోజు రాత్రి 12గంటల సమయంలో తండ్రి నిద్రలేచి చూసేసరికి కుమారుడు ఇంట్లో కనబడలేదు. దీంతో బంధువులు, చుట్టుపక్కల వారి వద్ద ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. మంగళవారం ఉదయం గ్రామ శివారులోని మొగుల చెరువులో మృతదేహం పైకి తేలింది. మృతదేహానికి పోస్ట్‌మార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

చేగుంట(తూప్రాన్): అనుమానాస్పద స్థితిలో ఓ మహిళ మృతి చెందిన సంఘటన మాసాయిపేట మండలం బొమ్మారంలో మంగళవారం చోటు చేసుకుంది. చేగుంట ఎస్‌ఐ ప్రకాశ్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం చేగుంట మండలం ఇబ్రహీంపూర్‌కు చెందిన కుమ్మరి సత్తవ్వ(60) కూతురు రేణుక వివాహం బొమ్మారం గ్రామానికి చెందిన దత్తుతో జరిగింది. సత్తవ్వ భర్త మూడేళ్ల క్రితం మృతి చెందగా, కూతురు రేణుక వద్ద ఉంటూ అప్పుడప్పుడు ఇబ్రహీంపూర్‌కు వచ్చి వెళుతుండేది. ఏం జరిగిందో గాని మంగళవారం ఉదయం బొమ్మారంలోని కూతురు ఇంట్లో సత్తమ్మ మృతదేహం కిటికీ వేలాడుతూ కనిపించింది. అమ్మ ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుందని రేణుక తన తమ్ముడికి ఫోన్ చేసింది.విషయం తెలుసుకున్న సత్తవ్వ కుమారుడు స్వామి సంఘటనస్థలికి చేరుకున్నారు. తన తల్లిని అక్క రేణుక, బావ దత్తులే హత్య చేశారని ఆరోపిస్తూ గొడవకు దిగాడు. స్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తూప్రాన్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

కారు అదుపుతప్పిన ఘటనలో ఒకరి మృతి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టిన ఘటనలో ఒకరు మృతి చెందాడు. ఈ సంఘటన మంగళవారం తెల్లవారుజామున రామచంద్రాపురం పట్టణంలోని జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. హైదరాబాద్ నగరంలోని అంబర్‌పేటకు చెందిన ఎండీ సాజిత్(28) డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. కాగా మంగళవారం తెల్లవారుజామున 2.30 గంటల సమయంలో అతని స్నేహితులు సుల్తాన్, ఇంతియాజ్‌తో కలిసి లింగంపల్లి వైపు నుంచి పటాన్‌చెరులోని ఇస్నాపూర్‌కు తినేందుకు కారులో బయలుదేరారు. అశోక్‌నగర్ సమీపంలో వేగంగా వెళ్తున్న కారును అదుపు చేయలేక డివైడర్‌ను ఢీ కొట్టారు. అదే వేగంతో ఎడమ వైపు ఆగి ఉన్న ప్రైవేట్ బస్సును ఢీ కొట్టారు. తీవ్ర గాయాలైన ముగ్గురిని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే సాజిత్ మృతి చెందినట్లు డాక్టర్ నిర్ధారించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



ప్రమాదానికి గురైన కారు

బెయిల్‌పై వచ్చి..తాగుడుకు బానిసై

దుబ్బాక: భార్యను చంపిన కేసులో బెయిల్‌పై జైలు నుంచి వచ్చిన భర్త జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన రాయపోల్ మండలం వడ్డేపల్లి గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. రాయపోల్ ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. వడ్డేపల్లి గ్రామానికి చెందిన చెట్టే సత్తయ్య (30) వ్యవసాయం చేసుకుంటూ.. జీవనం కొనసాగిస్తూ ఉండేవాడు. గతేడాది కుటుంబ సమస్యలతో భార్యను గొడ్డలితో నరికి చంపిన కేసులో జైలు పాలయ్యాడు. సత్తయ్య ఇద్దరు పిల్లలు తన అక్క దగ్గరే ఉంటున్నారు. ఇటీవల బెయిల్‌పై జైలు నుంచి బయటకు వచ్చిన సత్తయ్య తల్లి పోచమ్మతో కలిసి వడ్డేపల్లిలోనే ఉంటున్నాడు. అప్పటి నుంచి మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో తల్లి పోచవ్వ అహ్మదీపూర్‌లో ఉన్న తన కుమార్తె ఇంటికి నాలుగు రోజుల క్రితం వెళ్లింది. ఆమె సోమవారం రాత్రి తిరిగి ఇంటికి వచ్చే వరకు సత్తయ్య ఇంట్లో ఉరేసుకొని కనిపించాడు. దీంతో పోలీసులకు సమాచారం అందించడంతో పోలీసులు 3 రోజుల క్రితం ఉరేసుకుని ఉంటాడని తెలిపారు. మృతదేహాన్ని పరీక్షల నిమిత్తం గజ్వేల్ ఆస్పత్రికి తరలించారు. తల్లి పోచవ్వ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గ్యాస్ కనెక్షన్ల పేరిట మోసం

మద్దూరు(హుస్నాబాద్): గుర్తు తెలియని వ్యక్తులు గ్రామాల్లో తిరుగుతూ వృద్ధులను లక్ష్యంగా చేసుకొని వారిని మాటల్లో పెట్టి నగదు అపరిహరించారు. ఈ సంఘటన మండలంలోని మర్మాముల గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం ఓ గుర్తు తెలియని వ్యక్తి ద్విచక్ర వాహనంపై వచ్చి గ్రామానికి చెందిన శీలం విఠలయ్య ఇంటికి వచ్చి మీకు సబ్సిడీపై గ్యాస్ కనెక్షన్ మంజూరైందని రూ.3,800 చెల్లిస్తే గ్యాస్ సిలిండర్, స్టౌవ్ ఇస్తామని నమ్మించాడు. మీ కుమారుడు నాకు తెలుసునని ఆయనతో ఫోన్‌లో మాట్లాడినట్లు నమ్మించాడు. ఆ వ్యక్తి మాటలు నమ్మిన విఠలయ్య అతనికి రూ.3800 నగదు ఇచ్చాడు. గ్యాస్ బండి తీసుకొస్తానని చెప్పిన వ్యక్తి ఎంతకీ రాకపోవడంతో తాను మోసపోయానని గుర్తించాడు. ఐదు రోజుల క్రితం లద్నూరు గ్రామానికి చెందిన భోగి శ్రీరాములును సైతం గుర్తు తెలియని వ్యక్తి ఇదే రీతిలో గ్యాస్ కనెక్షన్ పేరుతో మాయామాటలు చెప్పి అతని నుంచి రూ.11,200 తీసుకొని పరారైనట్లు బాధితుడు వాపోయాడు. ఈ విషయంపై ఎస్‌ఐ నారాయణను వివరణ కోరగా తమకు ఎలాంటి ఫిర్యాదులు రాలేదని కేవలం మర్మాముల గ్రామంలో జరిగిన సంఘటన తమ దృష్టికి వచ్చిందన్నారు.

అదుపు తప్పిన మహారాష్ట్ర బస్సు

- బైక్‌ను తప్పించబోయి రోడ్డు కిందకు...
- పలువురికి స్వల్ప గాయాలు

పెద్దశంకరంపేట(మెదక్): హైదరాబాద్ నుంచి డెగ్లూర్ వెళుతున్న మహారాష్ట్రకు చెందిన బస్సు అదుపుతప్పి రోడ్డు కిందకు దూసుకెళ్లింది. ఈ ఘటన మంగళవారం సాయంత్రం పెద్దశంకరంపేట మండలం కమలాపూర్ వద్ద 161వ జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. సర్వీసు రోడ్డు మీదుగా వెళుతున్న మహారాష్ట్ర బస్సు ఎదురుగా వస్తున్న బైక్‌ను తప్పించబోయి అదుపుతప్పి రోడ్డు కిందకు దూసుకెళ్లింది. ప్రమాదంలో ఇద్దరికి గాయాలు కాగా, ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఎస్‌ఐ బాలరాజు సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు.



రోడ్డు కిందకు దూసుకెళ్లిన మహారాష్ట్ర బస్సు

ప్రేమపెళ్లి..రెండురోజులకే వద్దన్నాడు

- మనస్తాపంతో యువతి ఆత్మహత్యాయత్నం
- చికిత్స పొందుతూ మృతి

మనోహరాబాద్(తూప్రాన్): ప్రేమించాడు..పెళ్లి చేసుకున్నాడు..రెండురోజులకే ఇద్దరి కులాలు వేరంటూ వదిలేశాడు. తనకు న్యాయం చేయాలంటూ ఆ యువతి వేడుకున్నా కనికరించలేదు. దీంతో మనస్తాపం చెంది పురుగుల మందు తాగింది. నెల రోజులుగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది. దీంతో మృతురాలు కుటుంబీకులు, బంధువులు మృతదేహాన్ని ఆ యువకుడి ఇంటి వద్ద ఉంచి ఆందోళనకు దిగారు. మండలపరిధిలోని ధర్మరాజ్‌పల్లి గ్రామానికి చెందిన యశ్వంత్ రెడ్డి, అదే గ్రామానికి చెందిన బాషబోయిన తేజశ్రీ (18)లు మూడు సంవత్సరాలుగా ప్రేమించుకున్నారు. గతేడాది అక్టోబర్ 15న పెళ్లి చేసుకున్నారు. అక్టోబర్ 19న పోలీస్‌స్టేషన్‌లో ఇద్దరు కాపురం చేసుకుంటామని ఒప్పుకున్నారు. అయితే ఇద్దరి కులాలు వేరుకావడంతో విభేదాలు వచ్చాయి. యువతికి అండగా కులపెద్దలు ఉండి పెద్ద ఎత్తున నిరసనలు తెలిపినా ఎలాంటి న్యాయం జరగలేదు. దీంతో ఆ యువతి పురుగుల మందు తాగింది. ఇది గమనించిన కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించారు. నెల రోజులుగా చికిత్స పొందుతున్న తేజశ్రీ మంగళవారం వేకువజామున మృతి చెందింది. తేజశ్రీ మృతదేహాన్ని యశ్వంత్‌రెడ్డి ఇంటి వద్ద ఉంచి ఆందోళన చేపట్టారు. ఈ విషయం తెలుసుకున్న సీఐ శ్రీధర్, ఎస్‌ఐ సందీప్‌రెడ్డిలు సంఘటన స్థలానికి వచ్చి ఆందోళనకారులకు నచ్చజె ప్పారు. పోలీసులు చివరికి హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించి అంత్యక్రియలు చేశారు.



తేజశ్రీ(ఫైల్)

ఔటర్‌పై అత్యవసర వైద్యసేవలు

గతేడాది వెయ్యి మందికిపైగా చికిత్స

- ఔటర్‌రింగ్‌రోడ్డుపై ప్రమాద బాధితులకు క్షణాల్లో వైద్యసదుపాయం
- ఇంటర్‌ఛేంజ్‌ల వద్ద ట్రామాకేర్ సెంటర్లు
- టెలీమెడిసిన్ ద్వారా వైద్య నిపుణుల పర్యవేక్షణ

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ చుట్టూ 158 కిలోమీటర్ల మేర ఉన్న ఔటర్ రింగురోడ్డుపై ప్రమాదాల నియంత్రణకు హెచ్ఎండీఏ అనేక చర్యలు చేపట్టింది. హైదరాబాద్ గ్రోత్ కారిడార్ లిమిటెడ్ (హెచ్‌జీసీఎల్) ఆధ్వర్యంలో ఔటర్‌పైన ప్రతి 8 కిలోమీటర్లకు ఒక అడ్వాన్స్‌డ్ లైఫ్ సపోర్ట్ అంబులెన్సు(ఏఎల్ఎస్) అందుబాటులో ఉండేవిధంగా ఏర్పాట్లు చేశారు. 16 ఇంటర్‌ఛేంజ్‌ల వద్ద అత్యవసర వైద్యసేవలకు ట్రామాకేర్ సెంటర్లను ఏర్పాటు చేశారు. ఈ సెంటర్లలో గతేడాది 1098 మంది రోడ్డు ప్రమాద బాధితులకు సత్వర వైద్యసేవలు అందించారు. అపోలో, యశోద ఆస్పత్రులు ఈ అంబులెన్సులు ట్రామాకేర్ సెంటర్ల నిర్వహణ బాధ్యతలు చూస్తున్నాయి. గతేడాది అందజేసిన సేవలకు సంబంధించిన వివరాలను అధికారులు తాజాగా విడుదల చేశారు. పెద్దఅంబర్‌పేట్, బొంగులూరు, తుక్కుగూడ, శంషాబాద్, టీఎస్‌పీఏ ఇంటర్‌ఛేంజ్‌ల వద్ద అపోలో ఏఎల్ఎస్ అంబులెన్సులు ఉండగా, తారామతిపేట్, రావిర్యాల, పెద్దగోల్కొండ ఇంటర్‌ఛేంజ్‌ల వద్ద ట్రామాకేర్ సెంటర్‌లను ఏర్పాటు చేశారు. కోకాపేట్, పటాన్‌చెరు, దుండిగల్, శామీర్‌పేట్, ఘట్‌కేసర్‌లలో యశోద ఆసుపత్రికి చెందిన ఏఎల్ఎస్ అంబులెన్సులు 24 గంటల పాటు సేవలందజేస్తున్నాయి. కొల్లూరు, సుల్తాన్‌పూర్, మేడ్చల్‌లో ట్రామాకేర్ సెంటర్లను నిర్వహిస్తున్నారు. ప్రతి ట్రామాకేర్ సెంటర్‌లో 2 పడకలు, అవసరమైన వైద్య పరికరాలు, ఆక్సిజన్ సిలిండర్, అత్యవసర ప్రాణాధార మందులు ఉంటాయి. మరోవైపు టెలిమెడిసిన్ సదుపాయం ద్వారా వైద్యనిపుణులు సలహాలు, సూచనలు, వైద్యసేవలు అందిస్తున్నారు. పారామెడికల్ సిబ్బందితో కూడిన అంబులెన్సులను అన్ని కీలకమైన కేంద్రాల్లో అందుబాటులో ఉంచారు. ప్రమాదాలు జరిగిన వెంటనే బాధితులను సమీపంలోని ట్రామాకేర్ సెంటర్‌లకు తరలించే విధంగా ఈ అంబులెన్సులు సేవలను అందిస్తాయి. ఈ వైద్యసేవలన్నీ పూర్తిగా ఉచితం.



పటాన్‌చెరు	79	టీఎస్‌పీఏ	157
దుండిగల్	143	కోకాపేట్	91
శామీర్‌పేట్	85	తారామతిపేట్	25
ఘట్‌కేసర్	77	రావిర్యాల	3
పెద్దఅంబర్‌పేట్	127	పెద్దగోల్కొండ	9
బొంగులూరు	55	కొల్లూరు	48
తుక్కుగూడ	57	సుల్తాన్‌పూర్	39
శంషాబాద్	91	మేడ్చల్	12

(జనవరి నుంచి డిసెంబర్(2022) వరకు ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలోని ఆయా ఇంటర్‌ఛేంజ్‌ల వద్ద ట్రామాకేర్ సెంటర్లలో అందిన సత్వర వైద్య సేవలు ఇవి.)